సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 17 । జూలై । 2023



మిడ్‌మానేరుకు గోదావరి జలాలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్ నుంచి 2 వేల క్యూసెక్కుల గోదావరి నీరు వస్తోంది. 480 క్యూసెక్కుల ఔట్ ఫ్లో వెళ్తోంది.



కాల్వలు ఇలా.. నీరు పారేదెలా?

గంభీరావుపేట: ఎగువమానేరు ప్రాజెక్టు నుంచి ఆయకట్టు భూములకు నీరు వెళ్లే కాల్వలు చెట్లు పెరిగి, చెత్త చేరి అధ్వానంగా మారాయి.

- 8లో

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వేగంగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రామన్నపేట గుడికి టీటీడీ నిధులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సర్పంచ్, డైరెక్టర్లు, వార్డు సభ్యులు

చందుర్తి/వేములవాడ: మండలంలోని రామన్నపేట గండి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ దుమ్ము అంజయ్య తెలిపారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబును సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోతురాజు నాగేశం, సింగిల్‌విండో డైరెక్టర్ గుడిసె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం



వెంకట్రావుపేట-బావుసాయిపేట మధ్య పారుతున్న మూలవాగు

సిరిసిల్ల: జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. కోనరావుపేటలో అత్యధికంగా 33.0 మిల్లీమీటర్ల వర్షం పడగా.. పెంటివాగు వరదపారడంతో మూలవాగులో వరదపాయ కనిపించింది. రుద్రంగిలో 3.4 మిల్లీమీటర్లు, చందుర్తిలో 2.3, వేములవాడ రూరల్‌లో 0.5, బోయినపల్లిలో 1.1, వేములవాడలో 10.5, సిరిసిల్లలో 21.3, వీర్నపల్లిలో 23.8, ఎల్లారెడ్డిపేటలో 30.5, గంభీరావుపేటలో 9.5, ముస్తాబాద్‌లో 12.0, తంగళ్లపల్లిలో 17.9, ఇల్లంతకుంటలో 17.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 14.1 మిల్లీమీటర్లుగా నమోదైంది.

అప్పు చెల్లించాలంటూ బైఠాయింపు



అల్లాడి రమేశ్ ఇంటి ముందు బైఠాయించిన సరోజన-చంద్రమౌళి దంపతులు

వేములవాడ: తమ వద్ద అప్పుగా తీసుకున్న రూ.50లక్షలు చెల్లించాలంటూ కరీంనగర్‌కు చెందిన వృద్ధ దంపతులు సరోజన-చంద్రమౌళి వేములవాడకు చెందిన సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్ సోదరుల ఇంటి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఈ విషయాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిసింది. చంద్రమౌళి మాట్లాడుతూ అవసరాల కోసం తమ వద్ద రూ.50 లక్షల వరకు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదన్నారు. సమాజమే తమకు న్యాయం చేయాలని ఓ ఫ్లెక్సీ పట్టుకుని ఇంటి ముందు కూర్చున్నారు.

పాత వస్తువుల వేలానికి ప్రకటన

సిరిసిల్లఅర్బన్: సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో పాత వస్తువులను వేలం వేయనున్నట్లు కమాండెంట్ సుబ్రమణ్యం ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3న బెటాలియన్‌లో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాడుకలోలేని కంప్యూటర్లు, యూనిఫాం క్లాత్, పాతటెంట్లు, ఇనుప వస్తువులు, ప్లాస్టిక్ సామాగ్రిని వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డు, ప్రభుత్వ గుర్తింపుకార్డుతో హాజరుకావాలని సూచించారు. ముందస్తుగా రూ.వెయ్యి డిపాజిట్ చేయాలని సూచించారు. వివరాలకు 87126 57570, 87125 97285లో సంప్రదించాలని కోరారు.

నారుమడి పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆకునూరి శంకరయ్య

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని జిల్లా గ్రంథాలయంలో బాలసాహిత్యకారుడు వాసరవేణి పరుశరాము రచించిన నారుమడి పుస్తకాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య ఆవిష్కరించారు. రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్, జనపాల శంకరయ్య, మూడారి సాయిమహేశ్, శివాల భక్తర్, మహేందర్ పాల్గొన్నారు.

బియ్యం.. కయ్యం

'రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) 2022-2023 వానాకాలం(ఖరీఫ్), యాసంగి(రబీ) రెండు సీజన్ల బియ్యం వెంటనే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)కి అందించేలా చూడాలి. క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షించి లక్ష్యం మేరకు ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయాలి' అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జూలై 3న వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించారు. ఈమేరకు రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా పౌరసరఫరాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఎమ్మార్ లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాలతో పౌరసరఫరాల అధికారులు రైస్‌మిల్లర్లతో సమావేశమై సీఎమ్మార్‌ను ఎఫ్‌సీఐకి అందించాలని ఆదేశించారు.

- డ్యామేజీ పేరిట బియ్యం తిరస్కరణ
- ఎఫ్‌సీఐ గోదాముల్లో స్థలం కరువు
- నెరవేరని సీఎమ్మార్ లక్ష్యం
- బియ్యం అందించాలని ఒత్తిడి



జిల్లాలో రైస్‌మిల్లుల వివరాలు

రా రైస్‌మిల్లులు	: 69
బాయిల్డ్ రైస్‌మిల్లులు	: 30

2022-23లో ఖరీఫ్ వడ్లు	: 2,18,420.760 మెట్రిక్ టన్నులు
2022-23లో ఇచ్చిన సీఎమ్మార్	: 1,46,543.919 మెట్రిక్ టన్నులు
2022-23లో సీఎమ్మార్ బ్యాలెన్స్	: 1,38,045.759 మెట్రిక్ టన్నులు
2022-23లో రబీలో వడ్లు	: 2,49,776.000 మెట్రిక్ టన్నులు
2022-23లో ఇచ్చిన సీఎమ్మార్	: 1,68,099.860 మెట్రిక్ టన్నులు
2022-23లో సీఎమ్మార్ బ్యాలెన్స్	: 1,58,080.070 మెట్రిక్ టన్నులు

సిరిసిల్ల: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) లక్ష్యం నెరవేరడంపై అనుమానాలు కలుగుతున్నాయి. జిల్లా రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని మర ఆడించి ఎఫ్‌సీఐ గోదాములకు పంపిస్తుంటే నాణ్యత సరిగ్గా లేదంటూ తిప్పి పంపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎఫ్‌సీఐ గోదాముల్లో స్థలం లేక డ్యామేజీ పేరిట తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది.

డ్యామేజీ పేరిట రిజెక్ట్

- గంభీరావుపేట శివశక్తి రైస్‌మిల్లు యజమాని సీఎమ్మార్‌లో భాగంగా లారీ బియ్యాన్ని కరీంనగర్‌లోని ఎఫ్‌సీఐ గోదాముకు పంపించారు. ఎఫ్‌సీఐ అధికారులు ఆ బియ్యాని పరిశీలించి ఐదు శాతం డ్యామేజీ ఉందని వెనక్కి పంపించారు. నిజానికి 3శాతం డ్యామేజీ ఉన్న బియ్యం తీసుకోవాలి. కానీ 5 శాతం డ్యామేజీ చూపి రిజెక్ట్ చేశారు. రవాణా చార్జీలు, హమాలీ ఖర్చులు, గన్నీసంచుల డ్యామేజీ మొత్తంగా రైస్‌మిల్లర్‌కు రూ.60 వేలు నష్టం జరిగింది.
- రగుడు, రుద్రంగి, తంగళ్లపల్లికి చెందిన రైస్‌మిల్లర్ల బియ్యాన్ని కూడా ఇలాగే డ్యామేజీ ఉందంటూ వెనక్కి పంపించారు. ఆయా రైస్‌మిల్లర్లకు రవాణా ఖర్చులు మీదపడ్డాయి.
- ఎఫ్‌సీఐ గోదాములో బియ్యం నిల్వచేసేందుకు స్థలం లేకనే ఐదు శాతం డ్యామేజీ చూపుతూ బియ్యాన్ని వెనక్కి పంపుతున్నారు.
- జిల్లా రైస్‌మిల్లులకు కేటాయించిన సీడబ్ల్యూసీ కరీంనగర్ ఎఫ్‌సీఐ గోదాములో ఇప్పటికే 94.12 శాతం బియ్యం నిల్వలు ఉన్నాయి.

ర్యాకులు పోకనే సమస్య

కరీంనగర్ ఎఫ్‌సీఐ గోదాముల నుంచి బియ్యం ర్యాకులు పోవడం లేదు. ఒక్క ర్యాకు బియ్యం వెళ్లినా 90 ఏసీకేల నిల్వ సామర్థ్యం గోదాములో దొరకుతుంది. కానీ ఎఫ్‌సీఐ నుంచి బియ్యం ర్యాకులు వెళ్లకపోవంతో జిల్లాకు సంబంధించిన సీఎమ్మార్‌ను నిల్వ చేసేందుకు స్థలం కరువైంది. ఈ కారణంతోనే ఎఫ్‌సీఐ అధికారులు దింపుకోవడం లేదని తెలిసింది. ఈ విషయాన్ని మంత్రి గంగుల కమలాకర్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్‌ల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు.

క్వింటాలుకు 67 కిలోల బియ్యం

రైతుల వద్ద కొనుగోలు చేసి రైస్‌మిల్లర్లకు సరఫరా చేసిన వడ్లలో ప్రతి క్వింటాలుకు 67 కిలోల బియ్యాన్ని సీఎమ్మార్ కింద ఎఫ్‌సీఐకి సరఫరా చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి 2021-2022 వానాకాలం నాటి 7,155.140 మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ బియ్యం ఇంకా రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. ఆ బియ్యంపై 25 శాతం అదనంగా జరిమానాలు రూ.10 కోట్ల మేరకు విధించారు. ఆ బియ్యం ఇచ్చేందుకు రైస్‌మిల్లర్లు సిద్ధంగా ఉన్నామని జరిమానాలు చెల్లించలేమని చెబుతున్నారు.

అధికారులు ఒత్తిడి చేస్తున్నారు



సీఎమ్మార్ లక్ష్యం నెరవేర్చాలని పౌరసరఫరాల అధికారులు మాపై ఒత్తిడి చేస్తున్నారు. బియ్యం పంపితే ఎఫ్‌సీఐలో తీసుకోవడం లేదు. నిజానికి అక్కడ నిల్వ చేసేందుకు స్థలం లేదు. ఈ సమస్యను పరిష్కరించకుండా బియ్యం పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎఫ్‌సీఐలో మన జిల్లా బియ్యం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించాలి.

– వల్చు నాగరాజు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

లక్ష్యం గడువులోగా నెరవేర్చాల్సిందే



జిల్లాలో రైస్‌మిల్లర్ల వద్ద పెండింగ్ ఉన్న సీఎమ్మార్‌ను సెప్టెంబరు నెలాఖరులోగా పెట్టాల్సిందే. ఎఫ్‌సీఐలో సమస్యలుంటే పరిష్కారమార్గాన్ని అన్వేషించాలి. క్షేత్రస్థాయి ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైస్‌మిల్లర్లు మాత్రం గడువులోగా సీఎమ్మార్ ఇవ్వాల్సిందే.

– ఎస్.జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో



అ'పూర్వ' వేడుక

సిరిసిల్ల: ముప్పై ఐదేళ్ల క్రితం వారంతా కలిసి చదువుకున్నారు. జీవిత గమనంలో ఉన్నత చదువుల కోసం కొందరు.. ఉపాధి వెతుక్కుంటూ మరికొందరూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 35 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి సంగతులను నెమరువేసుకున్నారు. ఈ అ'పూర్వ' కలయికకు సిరిసిల్లలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్ వేదికైంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986-1988లో ఇంటర్‌మీడియట్ ఎంపీసీ, బైపీసీ చదువుకున్న విద్యార్థులు సుమారు 51 మంది ఇలా కలుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు లక్ష్మణ్‌రావు, చక్రధర్‌స్వామి, హన్మంతరావు, రమణయ్యలను సన్మానించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పూర్వవిద్యార్థులు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎలగొండ రవి, పబ్బతి విజయేందర్‌రెడ్డి, ఎల్లంకి సతీశ్, శ్రీధర్, వేణుగోపాల్‌రావు, బొద్దుల సుదర్శన్, సూర్యప్రకాశ్, రాజ్‌కుమార్, రాంప్రసాద్, శ్రీలత, శ్రీదేవి, అనురాధ, మంజుల, రమా, సరిత, పద్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యకారులు ప్రజల గొంతుకవ్వాలి



మాట్లాడుతున్న జూకంటి జగన్నాథం



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చైతన్యగౌడ్

- తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం
- జిల్లా తెరవే సర్వసభ్య సమావేశం
- అధ్యక్షుడిగా వెంగళి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చైతన్యగౌడ్

సిరిసిల్ల: సాహిత్యకారులు ప్రజల గొంతుకవ్వాలని తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం కోరారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం తెరవే జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జూకంటి జగన్నాథం మాట్లాడుతూ కవులు, రచయితలు ఎప్పుడూ ప్రజల సమస్యలపై అక్షరాలు సంధించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితలు, గాయకులు కీలకపాత్రను పోషించారని గుర్తుచేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సాహిత్యకారులు రాష్ట్ర ఏర్పాటు తర్వాత తమ కలాలకు పదును తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంపై, ప్రజల కోసం కవులు, రచయితలు రచనలు సాగించాలని కోరారు. తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా వంటి సమస్యలు రావడంతో కవులు, రచయితలు సందిగ్ధంలో ఉన్నారని, తెలంగాణ యాస, భాషలపై రచనలు చేస్తున్నారన్నారు. మునుముందు మరింత జాగరుకతతో తెలంగాణ సాహిత్యకారులు రచనలు చేయాలన్నారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడెపు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వూరడి మల్లికార్జున్, జిల్లా సాహిత్యకారులు మద్దికుంట లక్ష్మణ్, మోతుకుల నారాయణగౌడ్, భాగ్యలక్ష్మి, మచ్చ ఆనంద్, పురుషోత్తం, నీలి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా వెంగళ నాగరాజు

తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడిగా వెంగళ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వీరగోని చైతన్యగౌడ్, ఉపాధ్యక్షులుగా బుర్క గోపాల్, మరిగంటి శ్రీ కాంత్‌శర్మ, మహిళా ఉపాధ్యక్షురాలిగా కొలిపాక శోభారాణి, ఆర్థిక కార్యదర్శిగా నర్రా అంజిరెడ్డి, సహాయ కార్యదర్శిగా రేగుల భిక్షపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాకాల శంకర్‌గౌడ్, ప్రచార కార్యదర్శిగా గోనె బాల్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా ఈడెపు సౌమ్య, కార్యవర్గ సభ్యులుగా మార్వాడి సుదర్శన్, అర్కకాల రవీందర్, అలేఖ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అదను దాటుతోంది..



అడుగంటిన బావులు



బీడుగా మారిన వరిపంట పొలాలు

జిల్లాలోని పంటల వివరాలు(ఎకరాలలో..)

పంటలు	ప్రస్తుతం	అంచనా	గతేడాది
పత్తి	42 వేలు	60 వేలు	55 వేలు
వరి	20 వేలు	1.62లక్షలు	1.63లక్షలు
మొక్కజొన్న	150	-	-
కందులు	150	-	-

జిల్లాలో వర్షపాతం ఇలా..

కురవాల్సింది	231.1 మి.మీ
కురిసింది	155.5 మి.మీ
గతేడాది	592.5 మి.మీ

- వర్షం పడింది లేదు.. నాటు వేసింది లేదు
- అడుగంటిన భూగర్భజలాలు
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కరువు

వేములవాడఅర్బన్: వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలు కురువడం లేదు. గత నెల రోజులు చిరుజల్లులే కురుస్తుండడంతో వ్యవసాయ పనులు జోరందుకోవడం లేదు. భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు కాలం పరీక్షే పెడుతుంది. నారు ముదురుతుండడం.. మొదటి విత్తిన పత్తిగింజలు మొలకెత్తకపోవడంతో మళ్లీ విత్తుతున్నారు. బావుల్లోనూ నీరు అడుగంటుతుండడంతో నాట్లు వేస్తే పొలం ఎలా పారుతుందోననే ఆందోళన చెందుతున్నారు.

ముదురుతున్న వరినార్లు

ఇప్పటి వరకు దాదాపు 20 వేల ఎకరాలు మాత్రమే వరినాట్లు వేసినట్లు అధికారుల అంచనా. గతేడాది ఈ సమయం వరకు 50 వేల ఎకరాల వరకు వరినాట్లు వేశారు. ఈ సంవత్సరం సరైన వర్షాలు కురువకపోవడంతో బావి, బోర్లల్లో నీరు లేక వ్యవసాయ పనులు ముందుకుసాగడం లేదు. వరినారు పోసి నెల రోజులు దాటుతున్నా దుక్కి దున్నిందీ లేదంటున్నారు.

ప్రత్యామ్నాయంపై ప్రచారం కరువు

వర్షాలు సంతృప్తికరంగా లేకుంటే వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు ఏవి వేసుకోవాలో గ్రామాల్లో వ్యవసాయాధికారులు ప్రచారం చేయడం లేదు. రైతులు ఇప్పటికీ భారీ వర్షం కురిస్తే వరినాట్లు వేసుకోవాలనే ఆలోచనలోనే ఉన్నారు. అయితే వరికి బదులు మొక్కజొన్న, పప్పుదినుసులు, ఆముదాలు, నువ్వులు, పల్లి వేసుకోవాలని అధికారులు తెలుపుతున్నారు.

అడుగంటిన బావులు

ఈ వర్షాకాలంలో బావులు అడుగంటాయి. బోరుల్లో నీరు కూడ అంతగా లేకపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు.

దుక్కి దున్నలేదు



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. ఇప్పటికీ ఒక్క మడి కూడా దున్నలేదు. రోజు రెండు గంటలు కరెంట్ నడుస్తే నీళ్లు ఒక్క మడి కూడా పారడం లేదు. వర్షాలు లేక వరినాట్లు వేయడం కష్టంగా మారింది.

– కుడుకల బాలయ్య, నాంపల్లి

వరినారు ముదిరిపోతుంది



ఏటా ఎనిమిది ఎకరాలలో వరిపంట వేస్తాను. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురువకపోవడంతో దుక్కి దున్నలేదు. వరినారు మాత్రం ముదిరిపోతుంది. వర్షాలు కురిస్తే తప్ప నాటు వేయలేము.

– మల్లయ్య, అయ్యోరుపల్లి

నెలాఖరు వరకు వరి వేసుకోవచ్చు



వర్షాలు ఆశించిన స్థాయిలో కురువడం లేదు. రైతులు ఇప్పటికీ జిల్లాలో 20 వేల ఎకరాల వరకు వరినాట్లు వేశారు. ఇంక వేస్తున్నారు. రైతులు ఈ నెలాఖరు వరకూ వరినాట్లు వేసుకోవచ్చు.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

కోనరావుపేట(వేములవాడ): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. కోనరావుపేట మండలం నాగారంలో టిఫిన్ బై టాక్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్ల పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఈ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అన్ని రకాల పనులకు కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా ఉన్నాయన్నారు. కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, పార్లమెంట్ కో-కన్వీనర్ దశరథరెడ్డి, జగిత్యాల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, వేములవాడ ఎంపీపీ బండ మల్లేశం, బొల్లారం తిరుపతి, సురేశ్, బాలాజీ, మల్లికార్జున్, మార్త సత్తయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణాలు నిలబెడుతున్న సీఎమ్మార్‌ఎఫ్


చెక్కు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఆపద సమయంలో సీఎం సహాయనిధి పథకం నిరుపేదల ప్రాణాలు నిలబెడుతుందని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు పేర్కొన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, కోరుట్లపేట గ్రామాల్లోని లబ్ధిదారులకు ఆదివారం సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను అందించారు. పోతిరెడ్డిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న కనకట్ల మల్లయ్యకు మంజూరైన రూ.94వేల చెక్కును ఇంటికెళ్లి అందించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి,, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచులు దేవానందం, కోల అంజమ్మ, ఎంపీటీసీల మండల ఫోరం కన్వీనర్ మామిండ్ల తిరుపతిబాబు, మీడియా కన్వీనర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ లక్ష్మణరావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామస్థాయిలో పార్టీని బలోపేతమే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో బూతు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు పేర్కొన్నారు. కోరుట్లపేటలో ఆదివారం బూత్ కమిటీలను ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న బూత్ కమిటీల సభ్యులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలని కోరారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందె సుభాష్, కుంభాల మల్లారెడ్డి, దేవేందర్, సురేందర్‌రావు, సుధీర్‌రావు, ప్రభాకర్‌రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

మండెపల్లిలో ఉచిత వైద్యశిబిరం


పిల్లలకు మందులు ఇస్తున్న వైద్య బృందం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో ఆదివారం హిమాన్షి పిల్లల హాస్పిటల్ డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా చిన్నారులకు మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ గనప శివజ్యోతి, నాయకులు బాలకిషన్, పెద్ది దేవదాస్, మురళి, బుస్స లింగం పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త


పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల) : కుప్పలుగా పేరుకుపోయిన చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం చెత్తకుప్పగా పేరుకుపోయి కనిపించింది. పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు నిలిచిపోయాయి. దీంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. ఎవరి ఇంటిలోని చెత్తను వారే నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి పారవేయాలని సోషల్‌మీడియాలో చేసిన పోస్టుపై గ్రామస్తులు నిరసన తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్యం పనులు చేయించాలని కోరుతున్నారు.

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా?


పిచ్చిమొక్కలు పెరిగిన ఎడమ ప్రధాన కాలువ

- ఎగువమానేరు కాల్వలు అధ్వానం
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- శుభ్రం చేయించని అధికారులు
- చివరికి నీరందడం అనుమానమే

గంభీరావుపేట(సిరిసిల్ల): మెట్టప్రాంతానికి జీవనాధారం ఎగువమానేరు ప్రాజెక్టు కాల్వలు అధ్వానంగా మారాయి. ఆయకట్టు భూములకు సాగునీరందించే కాల్వల్లో చెత్తాచెదారం చేరింది. చుక్కనీరు ముందుకెళ్లకుండా పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలా మారాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నారుమడుల కోసం నీటిని విడుదల చేశారు. అయితే కాల్వల్లో పెరిగిన చెట్లతో చివరి ఆయకట్టు వరకు సాగునీరందడం అనుమానంగా మారింది.

అధికారుల నిర్లక్ష్యం

- కుడి ప్రధాన కాలువను అధికారులు ఇటీవల కొంతమేరకు శుభ్రం చేయించారు.
- ఎడమ ప్రధాన కాలువను పట్టించుకోవట్లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- కాలువల నిర్వహణ, లైనింగ్ మరమ్మతుల కోసం గతంలో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు.
- ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల పరిధిలోని కోళ్లమద్ది, కొత్తపల్లి, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, బండలింగంపల్లి, గోపాల్‌పల్లి, రాంరెడ్డిపల్లి, కొండాపూర్, గూడెం, గూడూరు, నామాపూర్, ముస్తాబాద్, తెర్లుమద్ది గ్రామాల వరకు సుమారు 13వేల ఆయకట్టు భూములు ఉన్నాయి.
- ఎడమ ప్రధాన కాలువ ద్వారా నర్మాల, గంభీరావుపేట గ్రామాల్లో దాదాపు 600 ఎకరాల ఆయకట్టు ఉంది.
- ప్రాజెక్టు పరిధిలో దాదాపు 20 డిస్ట్రిబ్యూటరీలు, మరో 40 సబ్ డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వాటిలో సగానికి పైగా లీకేజీలు, అధ్వాన్న స్థితిలో ఉన్నాయి.
- కాలువలు, తూములు, షట్టర్ల మరమ్మతుల కోసం ఇరిగేషన్‌శాఖ అధికారులు గతంలో రూ.60కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు కావడం లేదు.
- వానాకాలం సాగుకు నీటిని విడుదల చేయకముందే కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ఏపుగా పెరిగిన తుంగ, పనికిరాని చెట్ల పొదలను తొలగించే పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు.

కాల్వలను శుభ్రం చేయాలి



వానాకాలం సాగుకు నీటిని విడుదల చేయకముందే కాలువలను శుభ్రం చేస్తే చివరి ఆయకట్టు వరకు నీరందే అవకాశం ఉంటుంది. ఏటా కాలువల్లో నీరు సరిగ్గా పారక రైతులం ఇబ్బందులు పడుతున్నాం. ఈసారైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రాజబోయిన అంజనేయులు, నర్మాల

నిధులు మంజూరు చేయాలి



తూములు, షట్టర్లు పాడయి నీరు వృథాగా పోతోంది. కాలువల లైనింగ్ దెబ్బతింది. మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. వానాకాలం సాగుకు నీటిని విడుదల చేయాలి.

– చాత్రబోయిన రాజయ్య, నర్మాల

కొంత మేరకు శుభ్రం చేశాం

ఎగువమానేరు ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కా లువను దాదాపుగా శుభ్రం చేశాం. ఎడమ ప్రధాన కాలువను నాలుగైదు నెలల కిందట శుభ్రం చేశాం. నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెట్లపొదలను తొలగించే పనులు చేపడతాం. నీటి వృథా కాకుండా చూస్తాం. త్వరలోనే సాగునీటిని విడుదల చేస్తాం.

– నర్సింగ్, ఇరిగేషన్ డీఈ

చినుకు పడితే చిత్తడే


సిరిసిల్లలో బస్టాండ్ ప్రాంతంలో మురికిని ఎత్తిపోస్తున్న మున్సిపల్ సిబ్బంది

- సిరిసిల్లలో కంపు వాసన
- స్వచ్ఛ సిరిసిల్లకు ఇదో మచ్చ

సిరిసిల్ల: సిరిసిల్ల.. స్వచ్ఛతలో జాతీయస్థాయిలో అగ్రశ్రేణి పట్టణం.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డులు సాధించిన సిరిసిల్లలో చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. చిన్నపాటి వర్షం పడితే చాలు సిరిసిల్ల నేతన్నచౌక్ ముందు పెద్ద మురికి కూపం తయారవుతుంది. ఆ మురికిని ఎత్తిపోసేందుకు ఓ పది మంది మున్సిపల్ సిబ్బంది రోజంతా శ్రమిస్తే శుభ్రమవుతుంది. సిరిసిల్ల మున్సిపల్ ఇంజినీర్ల అనాలోచిత నిర్ణయంతో మురికికాల్వ నిర్మాణం లోపభూయిష్టంగా మారింది. రోడ్డు దిగువన ఉండగా మురికికాల్వ ఎగువన ఉంది. దీంతో ఎప్పుడు వర్షం పడినా మురికి నీరంతా రోడ్డుపైకి చేరుతుంది. 2015–16లో రూ.80లక్షలతో పాతబస్టాండు వద్ద నిర్మించిన డ్రెయినేజీ పైభాగంలో కట్టడంతో రోడ్డంతా మురికికూపంగా మారుతుంది. ఎప్పుడు వర్షం పడినా అక్కడ వరద రావడం.. ఆ తరువాత బురద మిగలడం పరిపాటిగా మారింది. బస్టాండ్ ప్రాంతం మొత్తం కంపు వాసన కొడుతోంది. వర్షం పడిన ప్రతిసారి మున్సిపాల్ పారిశుధ్య సిబ్బంది ఆ కంపును ఎత్తిపోస్తున్నారు. ఆ దిశగా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించి స్వచ్ఛ సిరిసిల్లకు మచ్చ రాకుండా చేయాల్సిన అవసరం ఉంది.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

- రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నామంటూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య విమర్శించారు. మండలంలోని కోరుట్లపేట సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఏ ఒక్క సబ్‌స్టేషన్ పరిధిలోనూ 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదన్నారు. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ మాత్రమే సరఫరా చేస్తున్నట్లు రికార్డులలో స్పష్టంగా తెలుస్తుందన్నారు. రైతుల రుణమాఫీ కాలేదన్నారు. వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు రూపాయి పరిహారం కూడా రాలేదని.. ఏ మొఖం పెట్టుకొని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజల్లోకి వెళ్తారని ప్రశ్నించారు. కిసాన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రేవంత్‌రెడ్డి సైన్యం జిల్లా అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, సర్పంచ్ దేవానందం, వార్డు సభ్యుడు రవి, నాయకులు కొత్తపల్లి దేవయ్య, గంట బుచ్చగౌడ్, సూడిద రాజేందర్, కోనేటి పోచయ్య, రమేశ్ పాల్గొన్నారు.

భర్త మారడం లేదనే మనస్తాపంతో ఆత్మహత్య


అనసూయ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తాగుడుకు బానిసైన భర్త ప్రవర్తనలో మార్పురావడం లేదనే మనస్తాపంతో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో వివాహిత బంధువులు భర్తకు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర, రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. మండంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గండికోట అనసూయ(30)కు మండలంలోని పదిరకు చెందిన గండికోట శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. శ్రీనివాస్ నిత్యం తాగివచ్చి మృతురాలిని వేధించేవాడు. దీంతోపాటు ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చకపోగా.. ప్రతిరోజు తాగొచ్చి జులాయిగా తిరిగేవాడు. భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో మనస్తాపంతో అనసూయ బాత్‌రూంలోని ఇనుపపైపుకు చీరతో ఉరివేసుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనసూయ మృతికి శ్రీనివాస్ కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతురాలి సోదరుడు బత్తుల కృష్ణంరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగిన పసి హృదయం


సిద్ధు (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): కొడుకును కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేవు. గుండెలో రంధ్రంతో ఏడాది వయస్సు గల కొడుకు చనిపోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని బంజేరు గ్రామానికి కన్నం బాబు–మమత దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఏడాది వయస్సు ఉన్న సిద్ధు సంతానం. సిద్ధు గుండెలో చిన్నరంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చికిత్స కోసం కరీంనగర్, హైదరాబాద్‌లలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించారు. నిరుపేద కుటుంబం అయినప్పటికీ రూ.3లక్షలు అప్పు చేసి చికిత్స చేయించారు. ఆపరేషన్‌కు మరో రూ.6లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో మళ్లీ అప్పు సమకూర్చుకునేందుకు ఇంటికొచ్చారు. శనివారం రాత్రి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడం గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

వివాహిత అదృశ్యం


కల్పన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వివాహిత గంగిపెల్లి కల్పన(30) అదృశ్యమైంది. ఈమేరకు పోలీసులు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. మండలకేంద్రానికి చెందిన వివాహిత శనివారం సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త రాజేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడి మృతి

- సంతాపం తెలిపిన మంత్రి కేటీఆర్


సంజీవ్ (ఫైల్)


పూలమాల వేస్తున్న జిందం కళాచక్రపాణి

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు కొమిరె సంజీవ్‌గౌడ్(43) ఆదివారం ఉదయం మరణించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సంజీవ్ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సంజీవ్ దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్ పార్టీ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య లత, కూతురు స్నేహిత ఉన్నారు. ఇటీవల సిరిసిల్ల పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ అనారోగ్యంతో ఉన్న సంజీవ్ ఇంటికెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం సంజీవ్‌ను హైదరాబాద్ పంపించారు. అయినా సంజీవ్‌ను మృత్యువు కబళించడంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంజీవ్ మృతిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ సంతాపం తెలిపారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సత్తార్ తదితరులు సంజీవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు.

నలుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం రాత్రి పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో నలుగురిపై కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

యువకుడి దుర్మరణం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన మునిగంటి సాయిరాం(22) బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని మృతిచెందాడు. మునిగంటి మంగ– ఎల్లయ్య దంపతులకు సాయిరాం ఒక్కడే కుమారుడు. ఆదివారం రాత్రి 9గంటలకు ద్విచక్ర వాహనంపై చామనపల్లి నుంచి నగునూరుకు వెళ్తుండగా జూబ్లీనగర్ శివారులో వాహనం అదుపు తప్పడంతో చెట్టును ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

కళాతపస్వి యెల్ల పోశెట్టి బయోపిక్


క్లాప్ కొడుతున్న డీపీఆర్వో దశరథం

వేములవాడఅర్బన్: వేములవాడ నృత్య కళానికేతన్ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సేవారత్న అవార్డు గ్రహీత కళాతపస్వి యెల్ల పోశెట్టి బయోపిక్ చిత్రీకరణను ఆదివారం ప్రారంభించారు. వేములవాడలోని పద్మశాలీ సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లాప్స్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. డీపీఆర్వో దశరథం మాట్లాడుతూ కళాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పోశెట్టి గత 35 ఏళ్లుగా చేస్తున్న సాంస్కృతిక కళారంగా సేవలను గుర్తించి బయోపిక్‌ను తీయడం అభినందనీయమన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన వేములవాడ నృత్యకళానికేతన్ సేవాసంస్థ అప్పటి నుంచి నేటి వరకు సినారె కళామందిరంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కళానికేతన్ సేవాసంస్థ అధ్యక్షుడు మనువాడ లక్ష్మీనారాయణ, ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, తెలంగాణ ట్రెడిషనల్ ఆర్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అలువాల ఏడుకొండలు, అష్టావధాని తిగుళ్ల శ్రీహరిశర్మ, వారాల దేవయ్య, సోమినేని బాలు, బొడ్డు రాములు, నారాయణ, బొజ్జ కనకయ్య ఉన్నారు.


ఎల్లమ్మ దేవతను దర్శించుకున్న జాగృతి సభ్యులు

ఆషాఢ వనభోజనాలు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో గంభీరావుపేట మండలంలోని ఊరూవాడా వనభోజనాలకు వెళ్లారు. గ్రామదేవతలను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ప్రకృతిని ఆస్వాదిస్తూ సామూహిక వనభోజనాలు చేశారు. మండల కేంద్రానికి చెందిన జాగృతి మిత్ర బృందం, మున్నూరుకాపు యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘ సభ్యులు వనభోజనాలకు వెళ్లారు.



బోనమో పోచమ్మ



సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఆషాఢమాసంలో చివరి ఆదివారం కావడంతో 34వ వార్డు ప్రజలు బోనాలతో వెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన నెత్తిన బోనంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో బోనాల జాతర కనుల పండువగా సాగింది. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, రెడ్డినాయక్, బీఆర్‌ఎస్ నాయకులు దార్ల సందీప్, అడ్డగట్ల మురళి పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయించొద్దు


రుద్రంగిలో పనులు అడ్డుకుంటున్న కార్మికులు


ఎల్లారెడ్డిపేటలో ట్రాక్టర్ అడ్డగింత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/రుద్రంగి(వేములవాడ): గ్రామపంచాయతీ కార్మికులు పదకొండు రోజులు సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదివారం ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయించారు. ఇది గమనించిన పారిశుధ్య కార్మికులు ఆ పనులు అడ్డుకున్నారు. తాము డిమాండ్ల సాధనకు 11 రోజులుగా సమ్మె చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం ఇతరులతో పారిశుధ్యం పనులు చేయించడం అన్యాయమన్నా రు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్‌కు అడ్డుగా పడుకుని నిరసన తెలిపారు. రుద్రంగిలో ప్రైవేట్ వ్యక్తులను అడ్డుకొని పనులు చేయొద్దని కోరారు. నిరసనలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్మికులు బాలకృష్ణ, లక్ష్మి నర్సయ్య, భీమయ్య, మల్లేశం, ఎల్లారెడ్డిపేటలో సీఐటీయూ మండలాధ్యక్షుడు జక్కుల మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.